## క్లుప్తంగా

### దుకాణాల తనిఖీ

కంభం: మండలంలోని పలు దుకాణాలను గురువారం మార్కాపురం తూనికలు, కొలతల శాఖ అధికారి షేక్ రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తురిమెళ్లలోని ఓ దుకాణంలో తనిఖీ చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. తూకాలు, కొలతల్లో మోసాలాకు పాల్పడినా, కాలం చెల్లిన వస్తువులు విక్రయించినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### సచివాలయం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంభం: మండలంలోని తురిమెళ్లలో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి గురువారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, పిల్లలకు అందించాలన్నారు. కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధార్ క్యాంప్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు



కంభం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వేషధారణ

కంభం: స్థానిక పార్కువీధిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు రసూల్ బేగ్ మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు విద్యార్థులు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. బిన్నత్వంలో ఏకత్వంపై అవగాహన కలిగించేలా విద్యార్థులు వేషధారణలు వేశారన్నారు. సాంస్కృతిక వైవిధ్యం విద్యార్థులకు తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

### వీఆర్‌ఏల సంఘ నూతన కార్యవర్గం ఎంపిక



వీఆర్‌ఏల సంఘ నూతన కార్యవర్గం

పెద్దదోర్నాల: గ్రామ రెవెన్యూ శాఖకు సంబంధించి వీఆర్‌ఏల సంఘ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడిగా పూర్ణకంటి యాకోబు, కార్యదర్శిగా గంపల చిన్న గురవయ్య, ట్రెజరర్‌గా దూదేకుల పెద్ద కాశయ్య, ఉపాధ్యక్షుడిగా ఇట్టే నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా భూమని నాగేశ్వర రావు, జాయింట్ సెక్రటరీగా తోకల వెంకటేశ్వర్లు, అడ్వైజర్లుగా దర్శనం పోలయ్య, సింగా రఘు, కమిటీ మెంబర్లుగా ఎలకపాటి రవి, ఊదర ప్రభుదాస్‌లు ఎంపికై నట్లు కమిటీ కార్యదర్శి గంపల చిన్న గురవయ్య తెలిపారు.

### రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలి



విత్తన దుకాణంలో శాంపిల్స్ సేకరిస్తున్న ఏఓ

పెద్దారవీడు: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఏఓ కె. బుజ్జిబాయి అన్నారు. మండల పరిధిలో హనుమాన్ జంక్షన్ కుంటలో గురువారం ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మినా, రైతులు కొనుగోలు చేసిన వాటిని బిల్లు కచ్చితంగా ఇవ్వాలని, అలా బిల్లు ఇవ్వని పక్షంలో దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయట మార్కెట్లో నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే రైతులు వెంటనే వ్యవసాయాధికారులకు తెలియజేయాలని సూచించారు. దుకాణాల్లో రిజిస్టర్లు పరిశీలించారు. దుకాణాల్లో విత్తనాలు శాంపిల్స్ సేకరించారు.

# బాబోయ్ భౌ..భౌ



రావిపాడు రోడ్డులో గుంపులు గుంపులుగా..



కంభంలో జాతీయ రహదారిపై తిష్టవేసిన శునకాలు

- రోడ్ల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- వాహనచోదకులు, పాదచారులకు హడల్

కంభం: గ్రామ సింహాలు.. నిజమైన సింహాల్లా టెర్రర్ పుట్టిస్తున్నాయి. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో కుక్కల బెడద రోజు రోజుకూ పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చీ పోయేవారిని వెంబడిస్తున్నాయి. హైవే రోడ్లపై కూడా సంచరిస్తున్నాయి. రాత్రిపూట ఇతర ప్రాంతాల నుంచి బస్సుల్లో, రైళ్లల్లో వచ్చిన వారికి ఆటోలు దొరక్క నడుచుకుంటే వెళితుంటే వెంటపడి దాడి చేస్తున్నాయి. అలాగే మాంసం, చేపల విక్రయ కేంద్రాల వద్ద తిష్ట వేస్తున్నాయి. కందులాపురం కూడలి, రావిపాడు రోడ్డు, వై. జంక్షన్, వాణిస్టూడియో బజారు, రామాలయం వీధి, శీలం వీధి, ఏబీఎం పాలెం, బస్టాండు, స్టార్ సినిమాలు సమీపంలో, గురుకుల పాఠశాల సమీపంలో పదుల సంఖ్యలో దాడి చేస్తున్నాయి. గడిచిన ఏడాదిలో కంభం ప్రభుత్వ వైద్యశాలలో 949 కుక్కకాటు కేసులు నమోదైనట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

**కుక్క కరిచిన వెంటనే వ్యాక్సిన్ తప్పని సరి**

కుక్క కరిచిన వెంటనే బట్టలు ఉతికే సబ్బుతో కడగితే వైరస్ సోకకుండా జాగ్రత్తపడ వచ్చు. గాయానికి కట్టు కట్టకూడదు. రక్తం పోతుందని కట్టుకడితే వైరస్ వ్యాప్తి అధికంగా ఉంటుంది. కుక్కకాటుకు గురైన వెంటనే వైద్యులను సంప్రదించి వ్యాక్సిన్ వేయించుకోవాలి. కరిచిన కుక్కను బట్టి ఐదు నుంచి ఏడు ఇంజక్షన్లు వేయించుకోవాల్సి ఉంటుంది. వీధి కుక్కలు కరిస్తేనే రేబిస్ వ్యాధి సోకుతుందని చాలా మంది అనుకుంటారు. వీధి కుక్కలే కాదు పెంపుడు కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. ఏ కుక్క కరిచినా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేసుకోవాలి.



బీసీ హాస్టల్ ఎదురుగా స్వైరవిహారం చేస్తున్న కుక్కలు

**ద్విచక్రవాహనంపై వెళ్తున్నా వెంబడిస్తున్నాయి:**



పనులు ముగించుకొని రాత్రి పూట ఇంటికి వెళ్లాలంటే కుక్కల దాటికి భయమేస్తోంది. బైక్ పై వెళ్తున్నా కుక్కలు వెంబడిస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– షేక్ మహబూబ్ బాష, కంభం

**కుక్కలను పట్టుకొని దూరంగా వదలాలి,**



బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది. రోడ్ల వెంబడి గుంపులు, గుంపులుగా తిరుగుతూ వచ్చి పోయే వాళ్లను వెంబడిస్తున్నాయి. రాత్రి పూట రైల్వే స్టేషన్ నుండి ఆటోల్లో వస్తున్నా ఆటోల వెంట పడుతున్నాయి.

– షేక్ బాషు, కంభం

## విధులు బహిష్కరించిన పారిశుధ్య కార్మికులు



కొమరోలు నాలుగు రోడ్ల కూడలి వద్ద పేరుకుపోయిన చెత్త



పంచాయతీ కార్మికులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకురాలు అంజమ్మ

కొమరోలు: గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు 30 నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో రం రోజుల నుంచి విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్తాచెదారాలు, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న వారు పంచాయతీ మంచినీరు కూడా వదలక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**విధులకు హాజరుకాని పంచాయతీ కార్యదర్శి**

కొమరోలు పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ జూలై 1వ తేదీ నుంచి సెలవుపై వెళ్లారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు మొదటి విడతలో భాగంగా నిరసన కార్యక్రమాలు ప్రారంభించిన రెండు రోజుల తర్వాత నుంచి పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ సెలవుపై వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి 23వ తేదీ సోమవారం కొమరోలు పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీ కార్మికులతో మాట్లాడారు. కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉదయం 10 గంటలకల్లా విధులకు హాజరు కావాలని, లేకుంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించినా కార్యదర్శి పట్టించుకోలేదు. డీపీఓ వచ్చినా పంచాయతీ కార్మికులకు సరైన హామీ ఇవ్వక పోవడంతో పంచాయతీ కార్మికులు విధులకు హాజరు కాలేదు. కలెక్టర్ అయినా చొరవ తీసుకుని తమ జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం మండల సీపీఎం నాయకురాలు అంజమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.

## ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ నమోదు పత్రం అందిస్తున్న కమిషనర్ కిరణ్



మల్లవరంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ కృష్ణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని 17, 18వ సచివాలయాల్లో ఆధార్ సేవల తీరును మున్సిపల్ కమిషనర్ కిరణ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఆధార్ నమోదుతోపాటు బయోమెట్రిక్ అప్‌డేషన్, మొబైల్ నంబరు మార్పు తదితర సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాలను పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఆధార్ నవీకరణ తప్పనిసరి**

పొదిలి రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల్లో చేపట్టిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ పీటీవీ కృష్ణ సూచించారు. గురువారం మల్లవరం గ్రామ సచివాలయంలో ఆధార్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆధార్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. బయోమెట్రిక్‌తోపాటు ఇతర మార్పుచేర్పులను గ్రామంలోనే చేసుకునేందుకు వీలున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం పాములపాడులో ఏర్పాటు చేస్తున్న ఆధార్ శిబిరాన్ని ఈగలపాడు, పాములపాడు, కుంచేపల్లి, దాసళ్లపల్లి, గొల్లపల్లి గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రేపు మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: ఈనెల 27 తేదీన ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షతన నిర్వహించన్నట్లు ఎంపీడీఓ సుగుణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు, సొసైటీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

### పశ్చిమ ప్రకాశానికి అధిక నిధులివ్వాలి

మార్కాపురం: పశ్చిమ ప్రకాశానికి కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి వెనుకబడిన ఈప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర కోరారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాయలసీమతో కలిపి కాకుండా ప్రత్యేకంగా నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి

- డీవైఈఓ చంద్రమౌళీశ్వర్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈఓ చంద్రమౌళీశ్వర్

కొనకనమిట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మార్కాపురం డీవైఈఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రేగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ట్యాబ్‌లు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. పాఠశాలలో వసతులపై హెచ్‌ఎం రామాంజనేయును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీవైఈఓను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు.

**తర్లుపాడు:** మండలంలోని లింగారెడ్డికాలనీ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 సుబ్బారావు గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, టీచర్ డైరీ, లెస్సన్ ప్లాన్, వర్క్‌బుక్, స్టూడెంట్ కిట్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమ వివరాలు తెలుసుకున్నారు. హెచ్‌ఎం మౌలాలీ ఆధ్వర్యంలో కలర్ డే యాక్టివిటీస్ ఉత్సాహంగా సాగాయి. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కాన్సెప్ట్‌లో పలు దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించారు.

### పోస్టాఫీసులో ఖాళీలు భర్తీ చేయాలి

మార్కాపురం: మార్కాపురం పోస్టాఫీసులో సిబ్బంది కొరతతో ఖాతాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని చిత్తారి రంగనాయకులు, ఎంవీ రమణ, కేవీ రమణారెడ్డి, రజాక్, అక్బర్ అలీ, శారద తదితరులు గురువారం ఒక ప్రటనలో పోస్టల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పోస్టాఫీకు వచ్చే ఖాతాదారులకు అందించాల్సిన సేవలు సిబ్బంది కొరత వల్ల చాలా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

### చట్టాలపై ప్రజలకు అవగాహన

కొనకనమిట్ల: గ్రామల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి, గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. గురువారం నాగరాజుకుంట, మునగపాడు గ్రామాల ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన చట్టాలు, న్యాయపరమైన అంశాలను వివరించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. అనంతరం కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను ఎస్సై తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మునగపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై

## మార్కాపురానికి తాగునీరు నాలుగు రోజులకోసారి!

- దూపాడు ఎస్‌ఎస్ ట్యాంకుకు చేరుతున్న సాగర్ నీరు
- 10 రోజుల్లో 400 మిలియన్ లీటర్ల పంపింగ్‌కు అధికారుల యత్నం
- ఈ నీరు 45 రోజుల వరకు సరిపోతుందని అంచనా



ఎస్ఎస్ ట్యాంకుకు చేరుతున్న సాగర్‌నీరు

మార్కాపురం టౌన్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దూపాడు ఎస్ఎస్ ట్యాంకు అడుగంటిపోవడంతో సుమారు 15 రోజులకుపైగా మార్కాపురం పట్టణ ప్రజలకు మంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతానికి ట్యాంకర్ల ద్వారా అరకొరగా సరఫరా చేస్తున్న నీటితోనే ప్రజలు సరిపెట్టుకోవాల్సిన దుస్థితి. ఇటీవల తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడుదల చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత నాలుగు రోజులుగా సాగర్ కాలువ నుంచి పైపు లైన్ల ద్వారా దూపాడు ఎస్ఎస్ ట్యాంకుకు నీరు చేరుతోంది. జిల్లాలోని చెరువులను నింపేందుకు సుమారు 10 రోజులపాటు నీటిని విడుదల చేయడంతో అధికారులు సుమారు 400 మిలియన్ లీటర్లకు పైగా నీటిని ఎస్ఎస్ ట్యాంకుకు మోటార్ల ద్వారా తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో మూడు రోజుల్లో డెడ్ స్టోరేజీ నుంచి స్టైనర్‌కు నీరందితే మార్కాపురం ప్రజలకు సాగర్ నీటిని అందిస్తామని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణ ప్రజలకు రోజుకు 10 మిలియన్ లీటర్ల నీరు అవసరం ఉందని, నాలుగు రోజులకొకసారి నీరు సరఫరా చేసినా 40 రోజులకు ఎస్ఎస్ ట్యాంక్ ఖాళీ అవుతుందని చెబుతున్నారు. ఇటీవల కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యామ్‌కు నీరు చేరుతుండటంతో కొంత మేర నీటి సమస్య తగ్గవచ్చని అధికారులు భావిస్తున్నారు. శ్రీశైలం డ్యామ్ నిండి దిగువన ఉన్న సాగర్‌కు నీరు విడుదల చేస్తేనే మంచి నీటి అవసరాలు తీరనున్నాయి.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం

సాక్షి ఎఫెక్ట్..



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: మండలంలోని పాతపాడు ఎస్సీ కాలనీలోని హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ–2 బరిగె నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుండటంపై గురువారం సాక్షిలో ‘సమస్యల మధ్య..బాలల విద్య’ ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీవైఈఓ చంద్రమౌళేశ్వర్ ఆదేశాల మేరకు ఎంఈఓ 2 గురువారం పాఠశాలలను సందర్శించారు. పాఠశాల హెచ్‌ఎం నారాయణను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నీటి వసతి కలిపించాలని, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలని, ప్రమాదకర విద్యుత్ వైరు తొలగించాలని, ప్రహరీ ఏర్పాటు చేయాల్సి ఉందని హెచ్‌ఎం వివరించారు. ఉన్నతాధికారులకు సమస్యలు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈఓ–2 పేర్కొన్నారు. ముందుగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైరును మార్చాలని లైన్‌మెన్‌కు సూచించారు.

## ప్రాజెక్టు సౌకర్యకు యూటీఎఫ్ విరాళం



హెచ్‌ఎంకు విరాళం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తర్లుపాడు: తర్లుపాడులోని ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రారంభించిన ప్రాజెక్టు సౌకర్యకు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విరాళం అందించింది. మెరుగైన సౌకర్యాల వల్ల విద్యార్థుల చదువుకు అనుకూలంగా ఉంటుందని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. వారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, మండల అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు నాసరయ్య, ప్రధాన కార్యదర్శి రంగనాయకులు, ట్రెజరర్ వి.కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఉత్సాహంగా శిక్షా సప్తాహ్



కేజీబీవీలో రంగవల్లిని తీర్చిదిద్దిన విద్యార్థినులు

కొనకనమిట్ల: జాతీయ విద్యా విధానం అమలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ‘శిక్షా సప్తాహ్’ కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులకు టీఎల్‌ఎం బోధన సామగ్రిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. సంఖ్యాశాస్త్రంపై విద్యార్థులు రూపొందించిన చార్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.